క్లుప్తంగా

భ్రూణ హత్యలు అరికడదాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ: గ్రామాల్లో భ్రూణ హత్యలు అరికడదామని రాకెట్ల పీహెచ్‌సీ సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫీ పేర్కొన్నారు. బుధవారం నెరిమెట్ల, రాయంపల్లిలో లింగవివక్ష నిర్మూలన, ఆడపిల్లల అవశ్యకతపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని ఆడ శిశువులను హత్య చేస్తున్నారన్నారు. వీటి నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయదుర్గంటౌన్: పట్టణ శివారులోని బీటీపీ రోడ్డు రైల్వేగేటు సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన కార్తీక (28), శశి (25) రాయదుర్గంలో పని ముగించుకొని తిరిగి వెళ్తుండగా, కార్తీక చీరకొంగు బైక్ చక్రానికి చుట్టుకొని అదుపు తప్పి కింద పడ్డారు. ప్రమాదంలో అక్క కార్తీకతోపాటు తమ్ముడు శశికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తీసుకెళ్లారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రణయ్‌రెడ్డి

కూడేరు: జయపురంలో వైఎస్సార్‌సీపీ నేత, ప్రైమరీ స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఓబుళపతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రణయ్‌రెడ్డి మృతుని ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడకండి, తాము, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎంపీపీ నారాయణ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ నమోదు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మూడు సచివాలయాల్లో గురువారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. 19,20,21వ తేదీల్లో పట్టణంలోని కొలిమివీధిలోని 2వ సచివాలయం (పాత మీసేవ కేంద్రం), 7వ సచివాలయంలో, 23, 24 తేదీల్లో పట్టణంలోని దబ్బడి కాంప్లెక్స్‌లోని 5వ సచివాలయంలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5 నుంచి 15 ఏళ్ల వరకు పిల్లలకు కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్డేట్, మొబైల్ నెంబర్ లింక్ మార్పులు, చేర్పులు, 60 ఏళ్లు పైబడిన వారికి బయోమెట్రిక్ అప్డేట్ చేస్తారన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని వివిధ సచివాలయాల్లో గురువారం నుంచి ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎంపీడీఓ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న దురదకుంట, 20న పాలవాయి, 21న తూర్పుకోడిపల్లి, 23న గరుడాపురం, కొత్తూరు గ్రామ పంచాయతీల సచివాలయాల్లో ఆధార్ సేవలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

టెంకాయల వేలం పాట

బెళుగుప్ప: రామసాగరం గ్రామ సమీపంలోని బూదిగుమ్మ ఆంజనేయస్వామి, వేంకటరమణ స్వామి క్షేత్రాల్లో పూజా సామగ్రితో కూడిన టెంకాయల వేలం పాటను బుధవారం నిర్వహించారు. మండల దేవదాయశాఖాధికారి ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేకాధికారి అక్కిరెడ్డి పర్యవేక్షణలో రామసాగరంలోని రామస్వామి ఆలయం వద్ద జరిగిన వేలంలో రామసాగరం వాసి ఎం.అక్కులప్ప రూ.1,71,000 దక్కించుకున్నాడు. సర్పంచ్ రామకృష్ణమ్మ, ఎంపీటీసీ వీరబొమ్మన్న, ఆలయ కమిటీల చైర్మన్లు తిమ్మారెడ్డి, ఈశ్వరమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పనుల కల్పనలో నిర్లక్ష్యం తగదు

కూడేరు: ఉపాధి హామీ పనుల కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా హెచ్చరించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ఉపాధి సిబ్బందితో పనుల కల్పనపై సమీక్షించారు. కూలీల సంఖ్య తక్కువగా ఉందని, ఇచ్చిన టార్గెట్ మేరకు కూలీల సంఖ్యను పెంచాల్సిందేనని ఆయన ఆదేశించారు. అనంతరం ముద్దలాపురంలో కూలీలతో సమావేశమయ్యారు. అడిగిన కూలీలందరికీ పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఎదుట ప్రజల సంతోషం





గరుడాపురం లే అవుట్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, గడేకల్లులో సంక్షేమ పథకాలు చదివి వినిపిస్తున్న విశ్వ

కళ్యాణదుర్గం: అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గరుడాపురం లే అవుట్‌లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. తాము రాజకీయాలు చేయమని, కులాలు, మతాలు చూడమని అర్హత ఉంటే చాలు పథకాలు అందిస్తామని మంత్రి వివరించారు. అర్హులుగా ఉండి నేటికీ పథకాలు అందని వారు ధ్రువీకరణ పత్రాలతో నేరుగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సత్వరమే సమస్యలు పరిష్కారమయ్యేందుకు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బిక్కి నాగలక్ష్మి, కౌన్సిలర్లు లక్ష్మన్న, అర్చన, పరమేశ్వరప్ప, నాయకులు శ్రీకాంత్, గాజుల అంజి, రామాంజినేయులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమం

విడపనకల్లు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందాయని, జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నామని ప్రజలు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఎదుట ప్రజల హర్షం వ్యక్తం చేశారు. బుధవారం గడేకల్లు సచివాలయం1 పరిధిలో మాజీ ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపలోను మాజీ ఎమ్మెల్యేకు మహిళలు నీరాజనాలు పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తమ బతుకులు ఎంతో మారాయని సంతోషం వెలిబుచ్చారు. పంటలు పండినా పండక పోయినా కూడా తమకు రూ.లక్షల్లో బీమా అందించారని గుర్తు చేశారు. ఈయనే పది కాలాలు పాటు ముఖ్యమంత్రిగా ఉంటే తమ పిల్లల తల రాతలు మారుస్తాడని చెప్పారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి

ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. దీన్ని ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నాయన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు ఎన్నికల్లో ప్రజలతో ఓట్లతో బుద్ధి చెబుతున్నారు. ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని వారి అవసరాలు తీరుస్తున్న ముఖ్యమంత్రి దేశంలో ఎవరూ లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో కలసి మాజీ ఎమ్మెల్యే సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు ఆయన భీమలింగేశ్వస్వామి దేవాయలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు సుశీల, ఎంపీటీసీ ఓబుళేసు భీంరెడ్డి, హంపయ్య, సోమనాథ్ రెడ్డి, , ధనుంజయరెడ్డి, ఓబుళప్ప, సర్పంచులు రామాంజనరెడ్డి, నాయకులు దేవరాజు, రాజశేఖర్, ప్రసాదు, సురేష్‌యాదవ్, తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ పెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

విడపనకల్లు: గడేకల్లులో బుధవారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన కురుబ సరోజమ్మకు రూ.20 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అందజేశారు. నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతోందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా సరోజమ్మ సీఎం వైఎస్‌జగన్, మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసింది.

పుట్టింటోళ్ల కంటే జగన్ సాయమే ఎక్కువ

- గడప గడపలోనూ దీవెనలు అందించిన ప్రజలు



రాయదుర్గం: కాదలూరు లో లబ్ధిదారురాలికి బ్రోచర్ అందజేస్తున్న విప్ కాపు

డి హీరేహాళ్ (రాయదుర్గం): పుట్టింటోళ్ల కంటే సీఎం జగన్ సాయమే ఎక్కువగా ఉంటోంది.. ఇంతలా ఆదరించే జగనన్న పాలనే మాకు కావాలి.. నాటి జన్మభూమి కమిటీలాంటి బానిస బతుకులు మాకొద్దు అంటూ డీహీరేహాళ్ మండలం కాదలూరు గ్రామస్తులు విప్ కాపు రామచంద్రారెడ్డి వద్ద ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం కాదలూరులో విప్ కాపు ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం ' కార్యక్రమం నిర్వహించారు. విప్ మాట్లాడుతూ మూడున్నరేళ్లలో ప్రభుత్వం ఎంత మేర సహాయం చేసిందో అంకెలతో సహా ముద్రించిన బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందించి, వివరించారు. గరిష్టంగా ఒక్కో కుటుంబానికి రూ.1.50 లక్షలకు పైగా ప్రభుత్వం సహాయం అందించింది, ఇంకా ప్రజలు ఏం కోరుకుంటారు..? అర్హులు ఎక్కడైనా మిగిలి ఉంటే గుర్తించి సహాయం అందించేందుకే ప్రభుత్వాన్నే సీఎం జగన్ ప్రజల వద్దకు పంపారని విప్ కాపు తెలియజేశారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే.. :

ఈ రాష్ట్రానికి మరో 30 ఏళ్ల పాటు సీఎం జగన్ సేవలు అవసరమని విప్ కాపు అన్నారు. మీ సంక్షేమం.. మీ బిడ్డల భవిష్యత్తు కోరుకునే జగన్‌పై ప్రజల ఆశీర్వాదం ఉండాలన్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు రాయదుర్గంను, రాష్ట్రాన్ని చంద్రబాబు దోచేసి సర్వనాశనం చేశాడన్నారు. ఇలాంటి ద్రోహులు మనకొద్దన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లీలావతి, హనుమంతరెడ్డి, ఎంపీటీసీ కల్యం అనిత, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, ఎంపీడీఓ బాస్కర్‌బాబు, తహసీల్దార్ రామాంజనేయులు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మైనార్టీ నాయకులు రహంతుల్లా, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లబ్ధిపొంది బుకాయించిన టీడీపీ నాయకులు..:

గ్రామానికి చెందిన పీ పురుషోత్తంరెడ్డి, పీ రామకృష్ణరెడ్డి అనే టీడీపీ నాయకులు ప్రభుత్వం నుంచి లబ్ధిపొంది తమకేమీ రాలేదన్నట్టు బుకాయించే ప్రయత్నం చేశారు. అధికారులు లెక్కలతో సహా చూపేసరికి అబాసు పాలయ్యారు. పురుషోత్తంరెడ్డికి క్రాప్ ఇన్సూరెన్స్, అమ్మఒడి, సున్నావడ్డీ, రైతు భరోసా ద్వారా ఇప్పటి వరకు రూ. 6,18,312. పీ రామకృష్ణరెడ్డికి క్రాప్ ఇన్సూరెన్స్, రైతుభరోసా, సున్నావడ్డీ పథకాల ద్వారా రూ.1,29,468 లక్షలు లబ్ధి పొందారు. తీసుకుని లేదంటున్నారని చివరకు ప్రజలే నవ్వుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

రాయదుర్గంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పాలన సాగిస్తోందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 9, 16వ వార్డుల్లోని చౌడమ్మగుడి, ఎస్సీ బాలికల హాస్టల్ వద్ద 'గడప గడపకూ మన ప్రభుత్వం' ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, వార్డు కౌన్సిలర్లు అరవ రేఖ, మల్లెపూల మమతతో కలిసి భూమి పూజ చేశారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఇప్పటికే రాయదుర్గంలో 16 సచివాలయాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యింది. వార్డుల్లో ప్రాధాన్యతగా గుర్తించిన 30 పనులకు గాను 6 పనులు పూర్తయినట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, వార్డు కౌన్సిలర్లు గోవిందరాజులు, శ్రీలక్ష్మీ, శ్రీనివాసరెడ్డి, డిష్‌గోవిందు, ఫకృద్దీన్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ....

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని పాతహడగలి, దొడగట్ట గ్రామాల్లో గురువారం ఉదయం 6:30 గంటలకే గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం. వన్నూర్‌స్వామి తెలిపారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొంటారన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి ఉషశ్రీచరణ్

బ్రహ్మసముద్రం: మండలంలోని సంతే కొండాపురంలో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ఆహ్వానం మేరకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ జాతరలో పాల్గొని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ రాము పాల్గొన్నారు.

మారెమ్మ దేవర

ఉరవకొండ: రేణుమాకుపల్లి గ్రామంలో మారెమ్మ దేవర బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ పెద్దలు, సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఊరేగింపుగా బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బెళుగుప్ప: రమనేపల్లిలో రెండు రోజులుగా కొనసాగిన మారెమ్మ జాతర బుధవారం ముగిసింది. దశాబ్దం తర్వాత నిర్వహించిన జాతరకు వేల మంది భక్తులు తరలిరాడంతో గ్రామం కిక్కిరిసి పోయింది. అమ్మవారు అఖండ దీపంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్, బెళుగుప్ప ఎస్ఐ రామకృష్ణయ్య, ఏఎస్ఐ రామదాసు బందోబస్తు నిర్వహించారు.

20 నుంచి బస్సు యాత్ర

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి చేపట్టే బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు హనుమంతరాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 4 వరకు యాత్ర జరుగుతుందన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

బొమ్మనహాళ్: బొల్లనగుడ్డం గ్రామంలో ఏపీజీబీ (ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు) బ్యాంకు సేవలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మేనేజర్ నరేష్, క్యాషియర్ ఎస్. హనీఫ్ మాట్లాడుతూ ఖాతాదారులకు స్వయం ఉపాధి రుణాలు, రైతులకు విరివిగా పంట రుణాలు, వ్యవసాయేతర రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత


- ప్రభుత్వ విప్ కాపు, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు



డ్రైవర్లతో ప్రమాణం చేయిస్తున్న విప్ కాపు, చిత్రంలో మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో ఎంవీఐ విశ్వనాథ్‌రెడ్డి అధ్యక్షతన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. విప్ తో పాటు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ కాపు భారతి, పీఆర్ డీఈ రామమోహన్‌రెడ్డి హాజరయ్యారు. వాహన డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ కాపు మాట్లాడారు. నిర్లక్ష్యంతోనే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల రాయదుర్గం వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడూరు గోపి, మంజునాథ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనను తలుస్తూ బావోద్వేగానికి గురయ్యారు. రోడ్డు సేఫ్టీ రూల్స్‌పై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన అవసరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ ఈ మూడు తప్పక పాటించాలన్నారు. అనంతరం ఏపీఐఐసీ చైర్మన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి నమ్ముకున్న కుటుంబాలను నట్టేట ముంచవద్దన్నారు. జాగ్రత్త వహిస్తూ, సురక్షితంగా ఇంటికి చేరుకోవాలన్నారు. అనంతరం ఎంవీఐ మాట్లాడుతూ ఈ నెల 18 నుండి 24 వరకు జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో వాహన డ్రైవర్లు, ఆర్టీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంబాపురంలో ఘనంగా జాతర



అమ్మవారికి పూజలు చేయిస్తున్న ప్రభుత్వ విప్ కాపు దంపతులు

కణేకల్లు: మండలంలోని అంబాపురంలో జాతర బుధవారం జరుపుకున్నారు. అమ్మవారి దేవర పోతు కోసం రచ్చుమర్రి, అంబాపురం గ్రామాల ప్రజలు ఘర్షణ పడిన విషయం విదితమే. పోలీసు స్టేషన్‌లో రెండు గ్రామాల ప్రజల మధ్య జరిగిన పంచాయితీలో చివరికి దేవరపోతు అంబాపురానికే దక్కింది. ఊరి దేవర కోసం ముందుగానే అవసరమైన ఏర్పాట్లను చేసుకున్న గ్రామస్తులు దేవరను ఘనంగా జరిపారు. కొల్లాపురమ్మదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవారం అర్ధరాత్రి అమ్మవారిదేవర పోతును బలిచ్చారు. బంధుమిత్రులతో గ్రామం కిక్కిరిసిపోయింది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, ఏపీఐసీసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి అమ్మవారికి పూజలు జరిపించారు. గ్రామంలో ప్రతి ఒక్కరినీ విప్ కాపు ఆప్యాయంగా పలుకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, సొసైటీ డైరెక్టర్ పర్వతరెడ్డి, బుడ్డి లేపాక్షిరెడ్డి, బోయ రమేష్ తదితరులు అమ్మవారికి పూజలు జరిపించారు.

వైభవంగా దేవమ్మ దేవి జాతర

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్టలో గ్రామదేవత దేవమ్మ దేవి జాతర బుధవారం వైభవంగా జరిగింది. దాదాపు వంద ఏళ్ల తర్వాత జాతర నిర్వహించారు. బుధవారం వేకువజామున ఆలయం ముందు దున్నపోతును బలిచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు కోళ్లు, మేకలు, పొట్టేళ్లను బలించారు. ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి దేవమ్మ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశ్వశాంతి మహోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బుధవారం విశ్వశాంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మ స్మృతి దినాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సేవా కేంద్ర సంచాలకులు బీకే యోగీశ్వరి తెలిపారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ గౌని శ్రీరామిరెడ్డి, జ్యోతి, రచన, గోపిప్రసాద్, సిద్దప్ప, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

బొమ్మనహాళ్: ఉంతకల్లు రుక్మిణి పాండురంగస్వామికి ఏకాదశి పూజలు బుధవారం తెల్లవారుజామున వైభవంగా జరిగాయి. వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక అభిషేకం చేసి, మూలవిరాట్‌కు పట్టు వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి పూజలు చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

కణేకల్లు: కణేకల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి ఫంక్షన్ హాలులో బుధవారం జరిగిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. సవేరా ఆస్పత్రి కార్డియాలజీ, ఆర్థో, ఐ, గైనిక్ స్పెషలిస్టులు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళ కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేలూరు మరియప్ప, కార్యదర్శి చాంద్‌బాషా, జిల్లా లయన్స్‌క్లబ్ కమిటీ సభ్యులు సత్యనారాయణ, స్థానికులు తిప్పేస్వామి, షేక్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు : స్థానిక శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల కమిటీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ బి.బాబు బుధవారం తెలిపారు. 30 ఏళ్లుపైబడిన వారు, స్థానికులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు వచ్చే నెల 7లోపు జిల్లా దేవాదాయ శాఖ అధికారి, డోర్ నంబర్ 1-4-609 రంగారెడ్డి మాన్షన్, హెచ్చెల్సీ కాలనీ, అనంతపురం చిరునామాకు రిజిష్టర్ పోస్టులో దరఖాస్తు ఫారంతో పాటు రెండు ఫొటోలు, ఆధార్, కుల ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలను పంపాలని కోరారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

కంబదూరు: రాష్ట్ర మంత్రి ఉషశ్రీచరణ్ గురువారం మండలంలో పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం 9 గంటలకు తిమ్మాపురంలో జరిగే మారెమ్మ జాతరకు హాజరవుతారన్నారు. తరువాత కంబదూరు చెరువులో చేప పిల్లలను వదిలేందుకు అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

చోళసముద్రం- కొర్రకోడు రోడ్డు పూర్తి



కూడేరు: చోళసముద్రం నుంచి కొర్రకోడుకు తారు రోడ్డు వేసిన దృశ్యం

కూడేరు: గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. మండలంలోని పి.నారాయణపురం నుంచి చోళసముద్రం మీదుగా కొర్రకోడు-హంసాయపల్లి క్రాస్ వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే చోళసముద్రం నుంచి పి.నారాయణపురానికి తారు రోడ్డు పనులు పూర్తయ్యాయి. రెండు రోజులు క్రితం చోళసముద్రం నుంచి కొర్రకోడు వరకు తారు రోడ్డు పనులు పూర్తి చేశారు. బుధవారం కొర్రకోడు-హంసాయ పల్లి క్రాస్ వరకు కంకర పని కొనసాగుతోంది. గతంలో ఈ రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో ప్రయాణం చేయడానికి ఇబ్బందిగా ఉండేది. తారు రోడ్డు ఏర్పాటు చేయడంతో ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..

23న మెగా వైద్య శిబిరం

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఈనెల 23 ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున తెలిపారు. బుధవారం శిబిరానికి సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. శిబిరంలో కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థో, స్త్రీ సంబంధిత వ్యాధులకు సంబందించి వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. లయన్స్ సభ్యులు చందా కేశన్న, కొమ్మసాని బాలచంద్ర, సప్తగిరిమల్లి స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ పెద్దన్న

ఉరవకొండ: రేణుమాకుపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. రాయదుర్గం పట్టణానికి చెందిన పెద్దన్న, తన స్నేహితుడు భరత్‌తో కలిసి బుధవారం రేణుమాకుపల్లిలో జరిగే మారెమ్మ దేవరకు బయలుదేరాడు. గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక వైపు నుండి ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాధవ



కళ్యాణదుర్గం: ఏపీ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికలు బుధవారం విజయవాడలో జరిగాయి. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కళ్యాణదుర్గంలోని ముద్దినాయనపల్లి పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న జక్కల మాధవను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో ఫోన్లో మాట్లాడారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర కార్యవర్గానికి మాధవ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు కుళ్లాయిస్వామి, తాలూకా అధ్యక్షుడు చిన్నారెడ్డి, కార్యదర్శి హరిప్రసాద్, రాకేష్, అరవింద్, సుభాషిణి, అచ్చమ్మ, శ్రీదేవి, జిల్లా నాయకులు జాన్సన్ తదితరులు మాధవకు అభినందనలు తెలియజేశారు.